# మండువా లోగిలి

రచన :
శ్రీమతి కామరుస్న సీతామహాలక్ష్మి.

తీరిక వేళ మండువాలో గిళ్ళలో ఉబుసుపోక ఊకదంపుడు కబుర్లు చెప్పుకొనే అమ్మలక్కలను చూస్తేనూ; పనిపాటలు తీరి ఒకరినొకరు పరామర్శించుకోడాలతో ప్రారంభించి; పంచవర్ష ప్రణాళికలవరకూ వెళ్ళి అమాంతంగా చేలగట్ల తగాదాల స్థాయికి దిగి రవరవలు పెంచుకొంటూ పంచలంబడి కూర్చున్న అయ్యవార్లను చూస్తేనూ ఏవో కొన్ని మధుర స్మృతులు; వెనుకటి సంగతులూ కొన్నీ నా మనస్సులో ప్రతిస్రుతులీనుతుంటాయి.

మాకు మండువాలోగిలి ఉన్నప్పటి కొన్ని ఊహలు మరచినవి మరచిపోగా మిగిలినవే కోకల్లలుగా ఉన్నై. ఇంటికి అనతిదూరంగా గొడ్లచావిడి ఉండేది. జోరున కురిసే వానల్లో మసకబారిన ప్రొద్దులో ఉరుముల మెరుపుల అట్టహాసాల్లో ఆ సమయం పగలో సంజయో తెలియకుండా ఉండేది. చినికే చినుకుల అంతరాంతరాలలో నుంచి చూపుమేరలో కనిపించే మా గొడ్లచావిడిలో కట్టివేసిన బలీవర్దాలను కిటికీలో కూర్చుని చూస్తూఉండేదాన్ని. అడపతడప గాలివాటుకు వానజల్లు నాపైబడి ఒళ్ళు జలదరించే దృశ్యం తలపుకువస్తే ఇప్పటికీ నా మేను పులకరిస్తోంది.

మా కమతగాండ్రు వానలకు ముందే కలుపూగట్రా తీసి తీరికగా ఉండేవాళ్ళు. ప్రొద్దున మసక చీకట్లలో కట్టుత్రాళ్ళతో చేలగట్లకుపోయి పచ్చగడ్డి మోపులు మోసుకుంటూ అన్నాల వేళకు తిరిగి వచ్చేవారు. ఆ మోపులు చూడగానే ఆకాశం గర్జించినట్లు ఆవుపెయ్యలు గిత్తదూడలు కోడెదూడలు అంభారవం చేసేవి. ఆరవం మాయవ్వ చెవులబడి, కమతగాండ్రకు భోజనం పెట్టే ఏర్పాట్లు చూచేది.

మా పాలెగాండ్రు అన్నాలు తిని చుట్టలు వెలిగించి అటకమీది గోగునార గుగ్గెళ్ళదాలిలోని బూడిదా తీసుకొని గొడ్లచావిడిలో కూర్చొని తాళ్లు పేనుతూ ఉండేవారు. త్రాళ్లు పేనడమంటే ఎడ్లతలత్రాళ్లు దుక్కిపగ్గాలు; జవ్వాయి మోకులు; పలుపులు, చికమోరలు, చిక్కాల దగ్గర నుంచి మా అవ్వకు చల్ల కవ్వపు త్రాళ్ళ వరకూ అన్నీ పేనుతుండేవారు. అయితే ఆ సమయంలో వారేవో ఊసులాడుకోవటం కనిపించేదే గాని దూరాన ఉన్న నాకు వినిపించేది గాదు. కాని వెంకటేసని మాకు నమ్మినబంటు. ప్రతి పాటుకు ఏదో ఒక పాట పాడుతూ వుండేవాడు. ఆ పాట ప్రతివారి పాటకు అనురూపమైన గతిలో ఉండేది. అలా ఆ కిటికీలో తుషారంలో అల్లాగ ఎంతసేపు కూర్చున్నానో నాకే తెలియదు. ఇటు తిరిగిచూద్దునుగదా-

మా అవ్వ కార్తిక మాసపు పూజలకు పత్తివత్తులు చేసుకొంటూ ఏదో కూనరాగం తీస్తుండేది. మా అమ్మ, వదిన అప్పడాలు ఒత్తుతూనో, పప్పులు విసురుకొంటూనో తిరగలి గరగరలలో వినిపించీ వినిపించని పాటతో పరవశులవుతూ వుండేవారు.

తల వాకిలిలో మా నాన్నకారు పెట్టెరాటం తుమ్మెదవలె ఝుంకారం చేస్తూండేది. పంతాలుకట్టి వంతులుపోయి చేస్తున్నారా అనిపించేది వారి పనిపాట్లు చూస్తే. మా నాన్నగారు మూడు చిలపల నూలు; మాఅమ్మ వదినె కలసి వందలమీద అప్పడాలు వత్తడం-ఇదంతా పందేలు కాక ఏమిటి?

మా ఇంట్లో మేమెవ్వరం ఏ కాలంలోనూ పగటె నిద్దురంటూ ఎరగము-ఒక్క బావ తప్పితే.

గాంధీగారి సర్వోదయ ఉద్యమంగాని, కదరు మ్రోతగాని మా బావకు వంట పట్టినట్టులేదు. మా బావంటే మా ఇల్లరికపుటల్లుడు నిజమనుకోనేరు. అతని కర్మవల్ల ఆ పేరు వచ్చింది. తప్పితే నిజంగా ఇల్లరికపుటల్లుడుకాదు.

ఆయనకేం మహరాజు-వాళ్ల ఊళ్లో నాలుగరకల భూమి మా అక్క మామగారే సేద్యం చేయిస్తాడు. అది భూమి అనిపించదు. రత్నగర్భ. మా బావ జేబునిండా కరకు రూకలు పోసుకొని వడ్రాతి దగ్గర పెద్దమర్రి క్రింద చీట్లాట ఆడుకొంటాడు. సిల్కు లాల్చీ రెండు జేబుల్లోనూ ఒకటి బీడీకట్ట, అగ్గిపెట్టె పోకచెక్కలు-వీటికోసం కేటాయించబడింది. ఆ కాలంలో అగ్గిపెట్టె అందరి దగ్గరా ఉండేదికాదు. ఆయనగారు-ఆ పిల్ల జమిందారు నిత్యాగ్నిహోత్రుడు గనుక ఏ నిమిషాన కావాలన్నా అగ్గి పిలిస్తే పలుకుతుంది,

రానురాను మా బావంటే అసహ్యం పుట్టింది. వానా కాలం చీట్లాటకు అనువుగా ఉండదని ఒంటె నిట్టాడి పాక ఒకటి వేయించారు. బావగారు మిత్ర బృందంతో కలిసి-అవర్డాతి స్థలంలోనే. ఆయన ఊరు కదలడు. ఎప్పుడైనా వెడితే వాళ్ళ వూరు వెడతాడు డబ్బులు కాళీ అయిపోతే. కొంత కాలం గడిచాక మా బావకు ఒళ్ళు రావడం మొదలైంది. అడప తడప కొన్ని జట్టీలు మా నాన్నగారి దగ్గరకు వచ్చేవి. చీట్లాటలో మా బావ చేసిన అప్పులనుకుంటాను. ఏమిటో ఆయనదంతా అదో మోస్తరు. పెదవాడు అనకూడదుగాని-నన్నడిగితే మా బావ మంచివాడేగాని ఒఠ్ఠి సోమరిపోతంటాను. అలా అంటే మా అక్కకు కోపం వస్తుంది.

అయితే జీవితంలో మరుపురాని సంఘటన ఒకటి వున్నది. ఒకనాడు మా అమ్మ ఎరక్కపోయి 'ఇంత తాడుముక్క తెచ్చిపెట్టు అల్లుడా' అని పురమాయించింది. బావ అటుచూసి ఇటుచూసి చివరకు మా నాన్నగారి పెట్టె రాటానికుండే త్రాడు పుటుక్కున త్రెంచుకొచ్చాడు.

ఇహ అవ్వాళ మధ్యాహ్నం మా నాన్నగారికి వచ్చిన కోపం ఇంతా అంతా కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే చాలసేపు కోప్పడీ కోప్పడీ చివరకు మా బావను 'ఛీ పశువా' అని ఊరుకొన్నారు. పాపం! మా బావకేం తెలుసు చెప్పండి రాట్నం త్రాడు తెంపకూడదని.

మా నాన్నగారికి కోపం వస్తే మేమెవ్వరం ఎదురు మాట్లాడలేం. ఆ సాయంత్రానికి మెల్లిగా వారిదగ్గరకు చేరి ఆమాటా ఈమాటా అడిగి చివరికి 'రాటం తాడు తెంచితే అంత కోపం ఎందుకండీ నాన్నా' అని అడిగాను.

అప్పుడు వారు చెప్పినవన్నీ నాకు గుర్తులేదుగాని ఉన్నంతవరకూ ఇక్కడ చెప్పి వదలిపెడతాను.

'నీకు తెలియదు తల్లీ-రాట్నం త్రాడు తెగితే ఎంత భాగ్యంగాని-బోలెడుపని పాడైంది చూడు. నాకు రాట్నం వడక్కపోడే మనసు పిచ్చి పిచ్చిగా ఉంటుంది, ఏమీ తోచదు. చిరాకుగా ఉంటుంది. అందుకని కోపం వచ్చింది.' అని చెప్పారు ఆయన.

తరవాత పెద్దలు చెప్పగా; నేను ఆలోచించుకోగా ఆ మాటల్లో ఏదో పరమసత్యమున్నదా అనిపిస్తోంది. పని చేసేటప్పుడు-అంటే కొన్ని పనులు కేవలం డబ్బు సంపాదించడానికే చేస్తామనుకోండి. ఏపని చేసినా ఆ చేసే పనిమీద శ్రద్ధాభక్తులతో చేయటమంటూ కొందరికి ఉంటుంది. చూద్దునుగదా-మా ఫంట కళ్ళం బాగు చేస్తే గచ్చుచేసినట్లు ఉండేది. వడ్లు పోతపోస్తే మచ్చుకి ఒక్క మట్టిబెడ్డకూడా కనిపించకుంట. ఇదంతా నేను చూసిందికాదు సుమండీ-మావూళ్ళో మా నాన్నగార్ని గురించి చాలామంది చెప్పే యథార్థం. ఇందులో స్తోత్రంగానీ, అతిశయోక్తిగానీ, అవంతైనా లేదు. ధనార్జనకోసం చేసే పనిలోనే మా నాన్నగారు అంతశ్రద్ధతో పనిచేసేవారు. వారి అభిప్రాయంలో ఏపని చేసినా పరమేశ్వరుని పూజించడమే అవుతుందట. కనుకనే వారికి పనిపట్ల అంత భక్తి.

ఔనా! మరి అల్లాంటి వ్యక్తికి రాట్నం అంటే ఎంత ఇదిగా ఉంటుందో ఆలోచించండి. వారు డబ్బు కోసంమాత్రం రాట్నం ఒడికేవారుకాదు. అంతవరకూ నాకు గట్టి నమ్మకం. మనోవికాసానికి; ఆత్మానందానికీ వారు ఆపని చేస్తారు. కాని ఇప్పుడెవరు ఏపని చేసినా ధనార్జనే ప్రథమ సూత్రంగా చేస్తారా అని అనిపించుతుంది.

వారు రాటము ఒడికేటప్పుడు చూడాలి. ధ్యానంలో ఉన్నట్లు ఉండేది. వారు నూలు వడకడం తపస్సుగా పెట్టుకున్నారు. నామటుకు నాకు ఆ కదరు ఝుంకారం ఓంకారంవలె వినిపించేది. తరవాత తరవాత నేను నూలు వడికే అనుభూతిలో రాట్నంలో పరమేశ్వర భావము కదరు ఝుంకృతిలో ప్రణవనాదము ఉన్నట్లు స్పష్టమైంది.

ఏమిటో - లోకం, పలు పోకడలు పోతుంది. తిన్నదరగక, ఉన్నది కరిగించుకుంటూ మా బావలాంటి సోమరులు తదేక ధ్యానంతో ప్రతి చిన్న పనిలోనూ ఆచితూచి పూజ్య భావంతో చేసే మా నాన్నవంటి మహర్షులూ-గులకరాళ్ళూ సెనగ గింజలూవలె కనిపించే ఈ సృష్టి - ఎంత విచిత్రమైనదీ.

ఈ సృష్టితో గాంధీజీ కోమటింట పుట్టి ఏమీ ఎరగనట్టే కొల్లాయి గట్టి - వ్యాపారమనే పైపూతతో రాట్నం ఒడికించి - మా అవ్వ అమ్మలాంటివారిచేత ఇంటి పనులు చేయించి - మనస్సుకు ఒక పోంకాన్ని కూర్చి ధన్యులను జేసిన, ఆ మహర్షి అడుగుజాడలు-మా బావలాంటివారివల్ల ఈ కళ్ళముందే మాయమై పోతున్నాయా అనిపిస్తుంది.

ఈ కిటికీ - మండుదా లోగిలీ - ఒకప్పుడు బిలబిల్లాడుతూ ఇంటికి నిండుగా తిరిగిన జనం - శిథిలమైన గొడ్ల చావిడీ - బూజుపట్టి పోతున్న మా నాన్నగారి పెట్టెరాటం చూస్తుంటే - నాకు కనులు అనుకోకుండా చెమ్మగిల్లుతున్నై.